# సినిమా న్యూస్

## 'రణబాలి'కి కొత్త చిక్కు

టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం రణబాలి, రౌడీ జనార్ధన అనే రెండు చిత్రాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. మొదటి ప్రణాళిక ప్రకారం రణబాలి చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదల చేసి, ఆ తర్వాత దాదాపు మూడు నెలల గ్యాప్‌తో డిసెంబర్‌లో రౌడీ జనార్ధనను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావించారు. అయితే ప్రస్తుతం రణబాలి షూటింగ్ అనుకున్న సమయానికి పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని సమాచారం. దీంతో ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌కు బదులుగా అక్టోబర్‌లో దసరా కానుకగా విడుదల చేయాలని భావించినప్పటికీ ఇప్పటికే ఆ సీజన్‌లో పలువురు స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉండటంతో ఇప్పుడు నవంబర్ లేదా డిసెంబర్‌లో రిలీజ్ చేసే దిశగా మేకర్స్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.


మరోవైపు రౌడీ జనార్ధన నిర్మాత దిల్ రాజు ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో విడుదల చేయాలనే ప్రణాళికతో ఉన్నట్లు సమాచారం. ఒకే నెలలో విజయ్ దేవరకొండ నటించిన రెండు సినిమాలు విడుదలైతే వాటి కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో రౌడీ జనార్ధన విడుదల తేదీ విషయంలో కొత్త ప్రణాళికలు రూపొందించే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో విజయ్ దేవరకొండ అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ఈ రెండు చిత్రాల విడుదల తేదీలపై ఆసక్తి నెలకొంది.




## కొత్త లుక్.. కొత్త జోష్!

మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా, పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న కొత్త సినిమా కొన్ని రోజుల క్రితమే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇన్ని రోజులపాటు ఈ చిత్రానికి అధికారిక టైటిల్‌ను ప్రకటించకపోవడంతో 'డీక్యూ41' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ కొనసాగించారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'శ్రీ శ్రీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే ప్రశాంతమైన వాతావరణంలో గోడపై కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. దీంతో ఇది ఓ హృద్యమైన ప్రేమకథగా తెరకెక్కుతున్నట్లు అర్థమవుతోంది.

పోస్టర్‌పై "హాశీజవ ఔఙశ్రీశ్రీ ాజూఖతీఎ౼ూస్త్రుఙఅ" అనే ట్యాగ్‌లైన్‌ను జోడించడం మరింత ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి రవి నెలకుడిటి కథ అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాతగా వ్యవహరిస్తుండగా, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ సినిమాను తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. అలాగే, ఈ చిత్రం 2026లో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కనిపించిన విజువల్స్, ఫీల్ ప్రేక్షకుల్లో సినిమాపై మంచి ఆసక్తిని పెంచుతున్నాయి.




## కెరీర్‌కు కొత్త ప్లాన్



దర్శకుడు మెహర్ రమేష్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆయన ఇప్పటివరకు పలువురు స్టార్ హీరోలతో సినిమాలను తెరకెక్కించారు. అయితే దర్శకుడిగా ఆశించిన స్థాయిలో విజయాలను మాత్రం అందుకోలేకపోయారు. ఆయన రూపొందించిన చిత్రాల్లో బిల్లా మాత్రమే చెప్పుకోదగ్గ విజయాన్ని సాధించగా, మిగతా సినిమాలు ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కిన భోళా శంకర్ చిత్రానికి కూడా మెహర్ రమేష్ దర్శకత్వం వహించారు.

మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. అయితే వరుస పరాజయాలు ఎదురైనా మెహర్ రమేష్ మాత్రం బిజీగానే ఉన్నట్లు సమాచారం. చాలా సంవత్సరాల క్రితం మహేష్ బాబు హీరోగా తెరకెక్కిన బాబీ చిత్రంలో ఆయన ఓ చిన్న పాత్రలో కనిపించారు. ప్రస్తుతం కూడా ఓ సినిమాలో అలాంటి చిన్న పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కొత్త కథను సిద్ధం చేసుకుని, దానికి సరిపోయే హీరో కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. విజయాలు లేకపోయినా మెహర్ రమేష్ తన కెరీర్‌ను బిజీగానే కొనసాగిస్తున్నారనే చర్చ సినీ వర్గాల్లో జరుగుతోంది.

## ఆగస్టులో వస్తున్న 'అగధ'

మా ఊరి పొలిమేర' సిరీస్‌తో ప్రేక్షకులను ఎంతగానో భయపెట్టి, నటిగా మంచి క్రేజ్ సంపాదించుకున్న కామాక్షి భాస్కర్ల ఇప్పుడు మరో విభిన్నమైన హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'అగధ' . టాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ ఎమ్.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. ఆత్మలు, చేతబడులు, మార్మిక శక్తుల నేపథ్యంలో సాగే ఒక పక్కా హారర్ థ్రిల్లర్ కావడం విశేషం. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను శ్రీ ఆది వరాహ బ్యానర్‌పై నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇందులో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయరాణి రెడ్డి వంటి నటీనటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు.

'ఇప్పటికే షూటింగ్ మొత్తం పూర్తి చేసుకున్న ఈ సినిమా.. థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమైంది. తాజాగా, ఈ విషయాన్ని మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించడంతో పాటుగా సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఇక విడుదల చేసిన పోస్టర్‌లో కామాక్షి లుక్ చూస్తే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడవడం ఖాయం. ముఖమంతా పసుపు, కుంకుమ పూసుకుని ఆమె ఎంతో భయంకరంగా కనిపిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 14న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు వెల్లడించారు. ఇక ఈ పోస్ట్‌కు.. "ఇంతకు ముందెన్నడూ చూడని సరికొత్త భయాన్ని చూడబోతున్నారు.. థియేటర్లలో ఒక మైండ్ బ్లోయింగ్ హారర్ ఎక్స్‌పీరియన్స్ కోసం రెడీగా ఉండండి" అంటూ మేకర్స్ సినిమాపై హైప్ పెంచేలా క్యాప్షన్ పెట్టారు.

